సాక్షి సూర్యాపేట

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



ఇరువర్గాల మధ్య ఘర్షణ

చివ్వెంల మండలం ఉండ్రుగొండలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. - 8లో



అర్వపల్లి ఆలయానికి మహర్దశ

అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. - 10లో

గరిష్టం/కనిష్టం 37°/19°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది

న్యూస్‌రీల్

యూరియాను అధిక మోతాదులో వాడొద్దు



ఆత్మకూర్‌లో పీఏసీఎస్‌లో పరిశీలిస్తున్న డీఏఓ

ఆత్మకూర్(ఎస్): రైతులు వరి పొలాలకు అధిక మోతాదులో యూరియాను వాడొద్దని జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నెమ్మికల్లు, ఆత్మకూర్, ఏపూరు గ్రామాల్లోని పీఏసీఎస్ కేంద్రాల్లో యూరియా అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ యూరియాను ఎక్కువ మోతాదులో వాడడం వల్ల వరికి చీడపీడలు సోకుతాయన్నారు. అంతేకాకుండా భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ఆయన వెంట ఏఓ దివ్య, పీఏసీఎస్‌ల సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

మద్దిరాల : రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రైతు వేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ వికాస్ పాటిల్, ఏఈఓ రాకేష్, సర్పంచ్ దామెర్ల వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ బద్దం సంజీవరెడ్డి, పతంజలి కంపెనీ సూపర్‌వైజర్ భద్రాచలం, ఉప సర్పంచ్ వెంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన

తిరుమలగిరి : మామిడాల గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకృతి వనాల్లో చెట్లను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్ చారి, ఎంపీఓ మారయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్డర్ కాపీ అందిస్తున్న మాధవరెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆర్డర్ కాపీలను అందించి మాట్లాడారు. జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు నిరుద్యోగ యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారని, మూడు ప్రైవేట్ కంపెనీలలో 44 ఉద్యోగాల ఖాళీలకు ప్రకటన ఇవ్వగా 118 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో అర్హత కలిగిన 20 మందిని ఎంపిక చేసి వారికి నియామకపత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కంపెనీల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శిగా నాగన్నగౌడ్



నాగన్నను అభినందిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : ఐఎన్‌టీయూసీ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీగా హుజూర్‌నగర్‌కు చెందిన యరగాని నాగన్నగౌడ్ రెండోసారి ఎన్నికయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన 33వ జాతీయ ప్లీనరీ సమావేశాల్లో నాగన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పలువురు నాయకులు ఆయనను అభినందించారు. కాగా శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్మికుల సంక్షేమం కోసం కృషిచేస్తానని చెప్పారు. నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. తనను కార్యదర్శిగా రెండోసారి ఎన్నుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

●వటపత్రశాయిగా నారసింహుడు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన వటపత్రశాయి అలంకార సేవ ఊరేగింపులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి, ఈఓ గీతారెడ్డి తదితరులు



హంస వాహన సేవపై నారసింహుడు

శునకం.. స్వైరవిహారం

పల్లెలు, పట్టణాల్లో కుక్కల బెడద

- వెంటపడి మరీ దాడులు చేస్తున్న వైనం
- తాజాగా సూర్యాపేటలో 15 మందిని గాయపర్చిన గ్రామసింహాలు
- ఘటనలు జరిగిందాకా స్పందించని అధికార యంత్రాంగం





సూర్యాపేట 23వ వార్డులో కుక్కల దాడిలో గాయపడిన బాలుడు (ఇన్‌సెట్‌లో) కాలుకు గాయాలు



శునకానికి సంతాన నిరోధక ఆపరేషన్ చేస్తున్న వైద్యుడు

కోదాడ పట్టణంలో సరిగ్గా రెండు నెలల క్రితం కుక్కలు దాడి చేసి నలుగురిని గాయపరిచాయి. అలాగే సూర్యాపేట పట్టణంలోనూ రెండు నెలల క్రితం నెహ్రూ నగర్‌లో కుక్కల దాడిలో ఇద్దరు చిన్నపిల్లలు గాయపడ్డారు. తాజాగా శుక్రవారం సూర్యాపేటలోని 23వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో శునకాల దాడిలో సుమారు 15 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఇలా జిల్లాలో నెలకొన్న కుక్కల బెడదతో పల్లెలే కాదు.. పట్టణాల వాసులు కూడా బెంబేలు చెందుతున్నారు. నిత్యం జిల్లాలో ఎక్కడో ఒకచోట జనంపై కుక్కల దాడి జరుగుతూనే ఉంది.

సూర్యాపేట: పల్లెలు, పట్టణాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. పగలు, రాత్రి వేళల్లో సైతం చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులపై పైశాచికంగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. జిల్లాలోసూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాలు, మారుమూల గ్రామాల్లో సైతం సుమారు 2లక్షలకుపైగా కుక్కలు ఉన్నాయని అధికారులే చెబుతున్నారు. కుక్కలకు సంతాన నిరోధక ఆపరేషన్లు చేయాలని ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం అధికారులను ఆదేశిస్తోంది. అయినా అధికార యంత్రాంగం ఆ వైపుగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఘటనలు జరిగితేనే..

ఎక్కడైనా కుక్కల దాడిలో జంతువులుకాని, మనుషులు కాని మరణించిన సమయంలోనే వాటికి సంతాన నిరోధక ఆపరేషన్లు చేయాలని అధికారులకు గుర్తుకు వస్తుంది. మామూలు సమయంలో వీధుల్లో తిరుగుతున్న కుక్కలను పట్టి తీసుకెళ్లి మాత్రం ఆపరేషన్లు చేయాలన్న ఆలోచన మాత్రం రావడం లేదు. దీంతో రోజురోజుకూ కుక్కల సంఖ్య పెరిగిపోతూ వాటి దాడులతో జనం హడలిపోతున్నారు.

ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ టీకాలు..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుక్క కాటుకు సంబంధించి యాంటీ రేబిస్ టీకాలు అందుబాటులో ఉంచారు. కుక్క కాటుకు గురైన వారు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రుల్లోని టీకాలను వేయించుకోవాల్సి ఉంటుంది. ఆలస్యం చేసి టీకాలు వేయించుకోకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

భయం.. భయంగా..

రాత్రి సమయంలో ప్రజలు తమ పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో వీధుల్లో తిరుగుతున్న కుక్కలు వెంట పడి మరీ దాడి చేస్తున్నాయి. నడుచుకుంటూ వెళ్లేవారినే కాకుండా వాహనాలు, బైక్‌ల మీద రాకపోకలు సాగించే వారి వెంటబడి దాడి చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు పరిగెత్తుకుంటూ వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక వాహనదారులైతే భయపడుతూ వాహనాలను నడపడంతో అదుపుతప్పి కిందపడి గాయాల పాలైన ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి.

కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం..



సూర్యాపేట పట్టణంలో కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 500 కుక్కలకు పైగా పట్టి కుక్కల సంతాన నిరోధక ఆపరేషన్లు చేయించాం. హైకోర్టు ఆదేశాలతో కుక్కలను మరలా అదే ప్రాంతాల్లో వదిలేస్తున్నాం.

– పి.రామానుజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

టీకాలు అందుబాటులో ఉంచాం



జిల్లాలోని జనరల్, ఏరియా ఆస్పత్రులతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క కాటుకు సంబంధించిన యాంటీ రేబిస్ టీకాలు అందుబాటులో ఉంచాం. కుక్కల సంతాన నియంత్రణకు ఆపరేషన్లు చేస్తున్నాం.

– డాక్టర్ కోటాచలం, డీఎంహెచ్‌ఓ, సూర్యాపేట

నేడు నేరేడుచర్ల మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్య ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యనే నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మున్సిపల్ కమిషనర్‌తో శనివారం 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 94922 56688



వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

'మనబడి' పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ వెంకట్రావు



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మన ఊరు – మనబడి పథకం కింద జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో జరుగుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మనఊరు–మనబడి పనుల పురోగతిపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మొదట విడతగా 329 పాఠశాలలు ఎంపికాగా అందులో 324 పాఠశాలలకు అనుమతులు వచ్చాయని, రూరల్ ఏరియాలో 279 అర్బన్ ఏరియాలో 50 పాఠశాలల్లో పనులు జరుతున్నాయని తెలిపారు. 46 పైలెట్ స్కూళ్లలో ఇప్పటికే 3 ప్రారంభించుకున్నామని మిగిలిన 43 పాఠశాలల పనులను మార్చి నెల 31 నాటికి పూర్తి చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇకపై పాఠశాల పనుల పరిశీలనకై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో 102 గ్రామ పంచాయతీ భవనాల పనులు వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం మండలాల వారీగా పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఈ రమేష్, పీఆర్ ఇంజనీర్లు, ఏఈలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

అనంతరం మండల విద్యాధికారులతో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పదో తరగతి ప్రత్యేక తరగతులను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ..విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం అందజేయాలని సూచించారు. ఈసందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో డీఈఓతోపాటు ఏడీ శైలజ, ఎంఈఓలు పాల్గొన్నారు

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తాం

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తామనికలెక్టర్ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ జీఓలు 58, 59, 76 అమలు, పోడు భూములు, ఆయిల్ పామ్ సాగుపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, డీఎఫ్‌ఓ సతీష్, ఆర్‌డీఓలు కోదాడ కిషోర్ కుమార్, హుజూర్‌నగర్ వెంకారెడ్డి, డీఎంహెచ్‌ఓ కోటాచలం, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రామారావు నాయక్, శ్రీధర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెమినార్‌ను జయప్రదం చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఈ నెల 27, 28 తేదీల్లో జనగామలో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశాల సందర్భంగా జరిగే సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి పిలుపునిచ్చారు. శుక్రవారం కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, జిల్లా నాయకులు అబ్రహం, సూరి, ఏసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

సూర్యాపేట క్రైం: రోడ్డు భద్రతా నియమాలు పాటించడం అందరి బాధ్యత అని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి 65, 365 (బీబీ), 365(ఏ)పై సీఐలు, ఎస్‌ఐలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎంఆర్, జాతీయ రహదారుల సంస్థ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ప్రజలకు అవగాహన కల్పించడం కోసం సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటేశ్వర్‌రెడ్డి, రవి, నాగభూషణం, సీఐలు సోమ నారాయణ సింగ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్, ఆంజనేయులు, పీఎన్‌డీ.ప్రసాద్, ఎస్‌ఐలు సాయిరాం, విష్ణుమూర్తి, లోకేష్, డీసీఆర్బీ రోడ్ సేఫ్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ నివారణకు జిల్లాకు నార్కోటిక్ డాగ్

అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలను గుర్తించి పట్టుకోవడానికి జిల్లాకు నార్కోటిక్ డాగ్(రోలెక్స్)ను కేటాయించారు. ఈరోలెక్స్ పనితీరుపై శుక్రవారం డాగ్ హ్యాండిలర్‌తో నిర్వహించిన రిహార్సల్‌ను ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా టన్నులకొద్దీ గంజాయిని సీజ్ చేశామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు శ్రీనివాస రావు, శ్రీనివాస్, గోవిందరావు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

తెలంగాణలో బహుజన రాజ్య స్థాపనే లక్ష్యం

- బీఎస్పీ ఎంపీ రాంజీగౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాంజీ గౌతమ్

కోదాడ: తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యం స్థాపనే లక్ష్యంగా ముందుకు పోతున్నామని బీఎస్పీ ఉత్తరప్రదేశ్ ఎంపీ రాంజీగౌతమ్ అన్నారు. శుక్రవారం కోదాడలో జరిగిన ఆ పార్టీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీ రెండు ఒకటేనన్నారు. తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో రెండు ప్రభుత్వాలు అలసత్వం వహిస్తే తానే పార్లమెంట్‌లో పోరాడానని గుర్తు చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్ అంబేద్కర్ పేరు చెప్పి మరోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో లక్షకు పైగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు మందా ప్రభాకర్, బాలస్వామి, దయానందరావు, పిల్లుట్ల శ్రీనివాస్, బొడ్డు కిరణ్, మల్లేశ్‌యాదవ్, కాంపాటి శ్రావణ్ పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవతోపాటు స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్త్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు నిర్వహించారు. ఆ తర్వాత మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారం

- సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారం చేసుకోగలుగుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని కొల్లగొడుతూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు. దేశంలోని 10 శాతం మంది చేతుల్లో 100శాతం సంపద దాగి ఉందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, రవి నాయక్, వెంకటేశ్వరరావు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : స్వయం ఉపాధి కోర్సుల్లో నిరుద్యోగ యువతకు భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), ఆటోమొబైల్ టు, త్రీ వీలర్ సర్వీసింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ట్యాలీ కోర్సుకు బీకాం, ఆటోమొబైల్ పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సున్న వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒర్జినల్, జిరాక్స్‌లు, పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డుతో మార్చి 1న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు 9133908000, 933908111, 9133908222 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎట్టకేలకు వేతన పెంపు ఉత్తర్వులు

- మధ్యాహ్న భోజన నిర్వాహకుల జీతాలపై స్పందించిన విద్యాశాఖ
- గత జూలైలోనే రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో 1,789 మందికి ప్రయోజనం



హుజూర్‌నగర్ : విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టే ఏజెన్సీల నిర్వాహకులకు వేతనాల పెంపుపై ఎట్టకేలకు ఇటీవల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు నిర్వాహకులకు ఇస్తున్న రూ.వెయ్యి గౌరవ వేతనాన్ని రూ.3 వేలకు పెంచుతూ గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పెంచిన వేతనాలను ఫిబ్రవరి నెల నుంచి అందించాలని నిర్ణయించినప్పటికీ గతంలో ఉత్తర్వులు ఇవ్వకుండా ఇటీవల జారీ చేసింది. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 951 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1,789 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులకు లబ్ధి చేకూరనుంది.

ఆందోళనల ఫలితంగానే..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో నానా ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తమ గౌరవ వేతనం పెంచాలని పలుమార్లు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ సమావేశాల్లో వీరి గౌరవ వేతనం రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచుతామని సీఎం కేసీఆర్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. దీనిపై గత జూలైలో ఆర్థిక శాఖ ఆమోదంతో జీఓ సైతం విడుదలైంది. అయితే ఇప్పటి వరకు అది అమలుకు నోచుకోలేదు. ఎట్టకేలకు వేతనాల పెంపుపై పాఠశాల విద్యాశాఖ నుంచి ఇటీవల ఉత్తరులు విడుదలలవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతినెలా అందించాలి



మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.వెయ్యి గౌరవ వేతనాన్ని రూ.3 వేలకు పెంచడం ఆనందంగా ఉంది. పెంచిన వేతనాన్ని ప్రతినెలా అందించాలి. అందుకు అధికారులు కూడా సహకరించాలి

– రాళ్లబండి మంగమ్మ, ఏజన్సీ నిర్వాహకురాలు, హుజూర్‌నగర్

పెంపుదల ఉత్తర్వులు జారీ అయ్యాయి



మధ్యాహ్న భోజన నిర్వాహకుల గౌరవ వేతనం పెంపు ఉత్తర్వులు ఉన్నతాధికారులు ఇటీవల జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అదించాలి. నిబంధనలు పాటించకుంటే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– అశోక్ కుమార్, డీఈఓ, సూర్యాపేట

భూమి విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

చివ్వెంల(సూర్యాపేట) : ఇంటి స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో చర్చి పక్కన ఉన్న 221 గజాల స్థల విషయంలో గ్రామానికి చెందిన మాద సుధాకు అదే గ్రామానికి చెందిన శీలం నాగయ్య, శీలం శ్రీను, శీలం వెంకటేశ్వర్లు, శీలం పవన్‌ల మధ్యన ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో ఆ స్థలంలో బావి ఉండడంతో దానిని పూడ్చివేసి ఇంటి నిర్మాణం కోసం సుధా గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకుంది. కాగా గ్రామానికి చెందిన శ్రీను, నాగయ్య, వెంకటేశ్వర్లు, పవన్‌లు అదే స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో శుక్రవారం స్థల విషయంలో సుధా, ఆమె సోదరుడు దార పుల్లయ్య, ఆయన కుమారుడు ప్రసన్న కుమార్, కూతుర్లు నవ్య, రాజేశ్వరీలకు నాగయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, పవన్‌లతో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణతో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ విష్ణుమూర్తిని వివరణ కోరగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

గరిడేపల్లి : తప్పిపోయిన బాలుడిని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో గుర్తుతెలియని బాలుడిని గ్రామ ప్రజలు గుర్తించి చైల్డ్ డిపార్ట్‌మెంట్ వారికి అప్పగించారు. బాలుడిని బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచి విచారించగా అతడి పేరు వనమా రాజీవ్‌గా, తల్లిదండ్రులు పద్మావతి, సురేష్ అని చెప్పాడు. ఈమేరకు బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సాయి త్రిలోక్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఉన్న బాబు తల్లిదండ్రులకు శుక్రవారం అప్పగించారు.

హంసవాహన సేవలో యాదాద్రీశుడు


హంసవాహన సేవలో పాల్గొన్న భక్తులు


వటపత్రశాయి అలంకరణ సేవ విశిష్టతను వివరిస్తున్న ఆచార్యులు

- యాదాద్రి క్షేత్రంలో కొనసాగుతున్న శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాలు
- ఉదయం వటపత్రశాయిగా.. సాయంత్రం హంసవాహన సేవలో భక్తులకు దర్శనం


వటపత్రశాయి అలంకరణలో స్వామివారు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారు వటపత్రశాయి అలంకార సేవలో.. సాయంత్రం హంస వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలయంలో వేకువజామునే..

ప్రధానాలయంలో వేకువజామునే నిత్యారాధనలు, నిత్యపూజల అనంతరం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు పారాయణీకులు వేద పారాయణం పఠించారు. అనంతరం ఉదయం 9.23 గంటలకు శ్రీస్వామి వారిని వటపత్రశాయి అలంకారంలో ప్రత్యేక పల్లకీపై అధిష్టించి ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పడమటి రాజగోపురం ఎదుట గల వేంచేపు మండపంలో శ్రీస్వామిని ప్రత్యేక బల్లపై అధిష్టించి విశేషంగా ఆరాధించారు. డోలు సన్నాయి మేళాలతో శ్రీస్వామికి మంగళకరమైన వాయిద్యాలతో కీర్తించారు. అలంకార సేవలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్‌తివారీ, ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సాయంత్రం వేళ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి వారిని హంస వాహన అలంకార సేవలో అలంకరించి ఊరేగించారు. దక్షిణ దిశలోని ప్రథమ ప్రాకారం నుంచి ప్రారంభమైన అలంకార సేవ పడమటి రాజగోపురం నుంచి ఉత్తరం, తూర్పు, దక్షిణ రాజగోపురాల ముందు నుంచి ముందుకు సాగింది. పడమటి రాజగోపురం ఎదుట గల వేంచేపు మండపంలో శ్రీస్వామి సేవను అధిష్టించి ఆచార్యులు వేద మంత్రాలను పఠించారు.

ఆలయంలో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శనివారం ఉదయం శ్రీస్వామి వారిని శ్రీకృష్ణాలంకరణ (మురళీ కృష్ణుడు) సేవ నిర్వహించనున్నారు. ఇక సాయంత్రం పొన్నవాహన సేవ ఊరేగింపు జరిపిస్తారు.

కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరం

శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వంశీకృష్ణ, హరీష్ నేతృత్వంలో ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. కొండపైన బస్టాండ్ వద్ద, కొండ కింద కల్యాణ కట్ట సమీపంలో భక్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం డాక్టర్ అలేఖ్య పుంజాల బృందం సభ్యులు కూచిపూడి ప్రదర్శన, అన్నమాచార్య ప్రాజెక్టు టీటీడీ బృందం వారిచే అన్నమాచార్య సంకీర్తనలు నిర్వహించారు.


కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారిణులు


సాంస్కృతిక వేదికపై అన్నమాచార్య సంకీర్తనలు ఆలపిస్తున్న టీటీడీ బృందం

కుక్కల దాడిలో 15మందికి గాయాలు

సూర్యాపేట: పట్టణంలోని పలు వార్డుల్లో శునకాలు శుక్రవారం 15మందిపై దాడిచేసి గాయపరిచాయి. పట్టణంలోని రాజీవ్‌నగర్, కొత్తగూడెం బజార్, నెహ్రూనగర్‌లో 15మందిని శునకాలు గాయపరిచాయి. గాయపడ్డ వారిని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి టీకాలు వేశారు. ఇటీవల సూర్యాపేట పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని, వాటిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, వివిధ ప్రాంతాల నుంచి సూర్యాపేట ఆస్పత్రికి రోజుకు కనీసం 30 నుంచి 40 కుక్క కాటు కేసులు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు.

ఆత్మకూర్‌లో 6 గొర్రెలు మృతి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వీధి కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల మల్లయ్య, నగిరె కృష్ణయ్యలు గొర్రెలను మేత కోసం గ్రామ శివారులోకి వేర్వేరుగా తోలుకుని వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో గుంపులుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా మందపై దాడిచేసి దాదాపు ఆరు గొర్రెలను చంపివేశాయి.


మృతిచెందిన గొర్రెలు

వరిపంటకు చీడపీడల బెడద

- అధికంగా పురుగు మందులు వాడితే పంటకు నష్టం
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న వ్యవసాయాధికారి ఎండీ జానిమియా

పాడి పంట

నడిగూడెం : ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట పెరిగే దశలోనూ, పలు ప్రాంతాల్లో చిరు పొట్ట దశల్లో ఉంది. అయితే వరి పంటకు చీడపీడలు ఆశించి నష్టపరుస్తున్నాయి. ఈ దశలో ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడొద్దని, మోతాదుగా వాడాలని సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండీ జానిమియా పేర్కొంటున్నారు. వరిసాగులో పాటించే సస్యరక్షణ చర్యలపై సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

కాండం తొలుచు పురుగు

ఈ పురుగు నారుమడి, పిలకదశ, అంకురం నుంచి చిరుపొట్టదశ వరకు ఆశిస్తుంది. పిలక దశలో మొవ్వు చనిపోతుంది. అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. కంకి పాలు పోసుకోక తాలుపోతుంది. ఈ పురుగులు ఆలస్యంగా నాట్లు పెట్టిన లేదా ముదురు నాట్లు పెట్టిన పొలాల్లో ఆశిస్తాయి.

నివారణ చర్యలు

నాట్లు ఆలస్యమైనప్పుడు నారు కొనలను తుంచి వేసుకోవాలి. ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి ప్రతివారం బుట్టలో పడే మగరెక్కల పురుగులను గమనించాలి. నష్ట పరిమితి స్థాయి దాటినప్పుడు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. దీనికి కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రినిల్ ప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ(దోమపోటు)

ఈ పురుగు నారుమడి లేదా పిలకల దశలో అరుదుగా, పొట్టదశ, ఈనిక దశల్లో ఎక్కువగా ఆశిస్తుంది. నీటి పైభాగంలో మొక్కల మొదళ్ల దగ్గర దోమలు కనబడతాయి. పిల్ల, పెద్ద పురుగులు రసాన్ని పీల్చడం వల్ల పైరు సుడులుగా ఎండిపోతుంది. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలం ఎండిపోయి పడిపోవడం, తాలు గింజలు లేదా నూర్పినప్పుడు నూకపోవడం జరుగుతుంది.

నివారణ చర్యలు

దోమను తట్టుకొనే రకాలను సాగు చేసుకోవాలి. నత్రజని అధిక మోతాదు తగ్గించుకోవాలి. కాలిబాటలు తీయాలి. ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా ఎథోఫెన్‌ప్రాక్స్ 2.0 మి.లీ, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి..

పాముపొడ తెగులు

దుబ్బు చేసు దశ నుంచి కాండం, మట్ట, ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు, పైరు పూర్తిగా ఎండిపోతుంది. తెగులు వెన్ను వరకు వ్యాపిస్తే తాలుగింజలు ఏర్పడతాయి.


వరి పైరుకు సోకిన అగ్గితెగులు, పాముపొడ తెగులు

నివారణ చర్యలు

విత్తన శుద్ధి చేయాలి. సిఫారసు మేరకు నత్రజని ఉపయోగించాలి. గట్లపై, చేనులో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. హెక్సాకొనాజోల్ 2. మి.లీ. లేదా ప్రొపికొనాజోల్ 1మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లికోడు లేదా గొట్టపు రోగం

ఇది నారుమడి, పిలక దశల్లో ఆశిస్తుంది. అంకురం ఉల్లి కాడవలె పొడగాటి గొట్టంలా మారి బయటకు వస్తుంది. కంకి వేయదు. దుబ్బుల్లో కొన్ని పిలకలు ఉల్లికాడవలె పొడగాటి గొట్టాలుగా మారతాయి.

నివారణ చర్యలు

దీనిని తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను 10కిలోలు లేదా ఫోరెట్ 10జి గుళికలను 5 కిలోలు ఎకరానికి నారు నాటిన 10నుంచి 15 రోజులకు వేసుకోవాలి.

అగ్గితెగులు

తొలిదశలో ఆకులపైన నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఇవి విస్తరించి మచ్చలు, చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి ఆకులు కాలిపోయినట్లుగా వ్యాపిస్తుంది. సిఫారసు మేరకు కాకుండా నత్రజని ఎరువుల అధిక మోతాదుల్లో వాడడం, గాలిలో తేమ అధికంగా ఉండడం, మబ్బుతో కూడిన వాతావరణం, సన్నని వర్షపు జల్లులు ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం.

నివారణ చర్యలు

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. పైరుపై తెగులు లక్షణాలు కనిపిస్తే పొలంలో నీటిని తీసివేయాలి. బాగా ఆరనివ్వాలి. దీని వల్ల శిలీంద్రం తాలూకు సిద్ధ బీజాలు నశిస్తాయి. ట్రైసైక్లేజోల్ 1.5గ్రాములు లేదా కాసుగామైసీన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.